## క్లుప్తంగా

### మురుగు సమస్య పరిష్కారం


కనెక్టింగ్ కాలువను నిర్మించేందుకు జేసీబీతో రోడ్డును తవ్విస్తున్న అధికారులు

**భోగాపురం:** మండలం కేంద్రంలోని మరడ వీధి కాలువలో మురుగునీరు నిలిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించిన అధికారులు మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం జేసీబీ సాయంతో గ్రామంలోని ప్రధాన రోడ్డులో కనెక్టింగ్ కాలువను ఏర్పాటు చేశారు. దీని ద్వారా మురుగునీరు నేరుగా ప్రధాన బట్టికాలువలోకి ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. మురుగు సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### ఆశా వర్కర్ల వినతి

**పూసపాటిరేగ:** ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రాజేశ్వరి కోరారు. ఈ మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో వైద్యాధికారి ప్రమీలాదేవికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్ల గౌరవ వేతనం పెంచాలని, పనిభారం తగ్గించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆమెతో పాటు హెల్త్ అసిస్టెంట్ ఆర్‌పీ రమణ, తదితరులు ఉన్నారు.

### సచివాలయ సందర్శన

**డెంకాడ:** మండలంలోని గొలగాం, పినతాడివాడ సచివాలయాలతో పాటు ఆర్.తమ్మాపురం ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ స్వరూపారాణి సందర్శించారు. రికార్డులు, సిబ్బంది హాజరు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలు, పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట స్థానిక సర్పంచ్ లెంక లక్ష్మణరావు ఉన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


వాటర్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు

**విజయనగరం:** వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీరాములనాయుడు అన్నారు. నగరంలోని మొయిద జంక్షన్ కుదిపి వద్ద, రామతీర్థం వద్ద జరుగుతున్న వాటర్ వర్క్స్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. నీటి సామర్థ్యం ఏ మేరకు ఉంది, లీకులు, ఇతర సాంకేతిక పరమైన సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అక్కడి ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్యాండ్ బ్యాగ్స్ అమర్చుతున్న తీరును గమనించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. లీకులను సరి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామన్నారు. నీటిమట్టాలు అడుగంటిన పరిస్థితుల్లో ఇతర జలాశయాల నుంచి నీటిని పంపింగ్ చేసేలా ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు వివరించారు. తాగునీటిని వృథా చేయొద్దని ప్రజలను కోరారు. ఆయన వెంట డీఈ అప్పారావు, తదితరులు ఉన్నారు.

### మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు


మాట్లాడుతున్న ఏఎస్పీ పర్వీన్

**గజపతినగరం రూరల్:** యువత మాదకద్రవ్యాల జోలికి పోయి ఆరోగ్యాన్ని, భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ అస్మా పర్వీన్ సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాలపై మండలంలోని మరుపల్లి బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెడువ్యసనాలకు బానిసగా మారితే జీవిత అంధకారమవుతుందని, ప్రతి ఒక్కరూ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఎక్కడైనా ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినా, వినియోగించినా 14500 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కళాశాల కరెస్పాండెంట్ రెడ్డి చంద్రశేఖర్, గజపతినగరం సీఐ లెంక అప్పలనాయుడు పాల్గొన్నారు.

### ఘనంగా త్రిపురమాంబ తీర్థం

**వేపాడ:** మండలంలోని చినదుంగాడ గ్రామదేవత త్రిపురమాంబ అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

# • కలల కాలనీ..

ప్రస్తుతం ఊపందుకున్న ఇళ్ల నిర్మాణాలు


ప్రారంభంలో లేఅవుట్..


విజయనగరం జిల్లా కేంద్రానికి సమీపంలో గుంకలాం వద్ద అభివృద్ధి చేసిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నాడు వేసిన పునాదులు నేడు ఇళ్లుగా మారుతున్నాయి. లబ్ధిదారులకు కావాల్సిన మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుండడంతో నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకొస్తున్నారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తిచేసిన వారు ఉగాదికి సామూహిక గృహప్రవేశాలకు సన్నద్ధమవుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

# ఆస్తిపన్ను వసూలులో ప్రథమ స్థానం

- నగరపంచాయతీ పరిధి 6,7 వార్డుల్లో శతశాతం పన్ను వసూలు
- రాష్ట్రస్థాయిలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన సచివాలయాలు
- పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలి: కమిషనర్ బాలాజీ


వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

**నెల్లిమర్ల:** ఆస్తిపన్ను వసూళ్లలో నెల్లిమర్ల నగరపంచాయతీకి చెందిన 6, 7 వార్డు సచివాలయాలు శతశాతం లక్ష్యాలను సాధించి, రాష్ట్రంలోనే ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ తెలిపారు. స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరో వార్డు సచివాలయం పరిధిలో ప్రైవేటు ఆస్తులకు సంబంధించి మొత్తం 545 అసెస్మెంట్లు ఉండగా ఈ నెల 15వ తేదీనాటికి సదరు సిబ్బంది అన్నింటినీ వసూలు చేశారన్నారు. దీంతో రాష్ట్రంలోనే శతశాతం పన్ను వసూలు చేసిన మొట్టమొదటి సచివాలయంగా నిలిచిందన్నారు. అలాగే 7వ వార్డు సచివాలయం పరిధిలో 417 అసెస్మెంట్లు ఉండగా సదరు సిబ్బంది కూడా ఈ నెల 16వ తేదీనాటికి శతశాతం లక్ష్యాలను సాధించి, రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచినట్లు చెప్పారు. గడువు తేదీకి ముందుగానే లక్ష్యాలను సాధించిన రెండు సచివాలయాల సిబ్బందిని ఆయన అభినందించారు. అలాగే నగరపంచాయతీ పరిధిలోని 8 వార్డు సచివాలయాల్లో మొత్తం 5286 అసెస్మెంట్లకు గాను ఇప్పటివరకు 85శాతం పన్ను వసూలు అయినట్లు వివరించారు. న్యాయస్థానం పరిధిలో 993 అసెస్మెంట్లు ఉన్నాయని, వడ్డీతో కలిపి రూ.5.99 కోట్లు పన్ను బకాయి ఉందన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి ఇంకా రూ.28 లక్షలు వసూలు కావాల్సి ఉందన్నారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటించిందని, యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు. వెంటనే పన్ను బకాయిలు చెల్లించి, నగరపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయనతోపాటు మేనేజరు టీవీఎస్ విశ్వేశ్వరరావు ఉన్నారు.

## మొక్కల సంరక్షణ బాధ్యత అందరిదీ..


సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

**విజయనగరం:** నగరంలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ శ్రీరాములనాయుడు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం తన కార్యాలయం ఆవరణలో పట్టణంలో మొక్కల సంరక్షణ బాధ్యతలు చూస్తున్న సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో కీలకమన్నారు. ఈ ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం కార్యక్రమం కింద నగరంలో అనేక మొక్కలను నాటినట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనలు, సలహాలతో మొక్కల సంరక్షణ బాధ్యతను సమీప స్థానికులకు అప్పగించినట్లు తెలిపారు. వేసవిలో మొక్కలు చనిపోయే ప్రమాదం ఉందని, ప్రతీ మొక్కనూ సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. మొక్కలకు నీరు అందించేందుకు 2 వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం పాలాస్పత్రిలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం అయ్యారు. ఆస్తి పన్నుతో చెత్తపన్ను అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

### సచివాలయంలో కలెక్టర్ తనిఖీలు

**చీపురుపల్లిరూరల్:** మండలంలోని రావివలస గ్రామ సచివాలయంలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. పథకాల అమలుపై, గర్భిణులు, చిన్నారులకు రక్త పరీక్షలు చేస్తున్నారా లేదా, పోషకాహార పంపిణీ, గృహనిర్మాణాలపై ఆయా శాఖలకు సంబంధించిన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 'సఖి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని చెప్పారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రం తదితర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

# మహిళా మార్ట్‌లు భళా

- రూ. కోటి పెట్టుబడితో రెండు మార్ట్‌లు
- 34,385 మంది మహిళల భాగస్వామ్యం
- శాశ్వత ఉపాధికి చేయూత
- ఆర్థిక లావాదేవీలపై శిక్షణ


గరివిడి మహిళా మార్ట్‌లో కొనుగోలుదారుల సందడి

**శృంగవరపుకోట:** మహిళలు ఆర్థికస్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక విధాలుగా వారిని ప్రోత్సాహిస్తోంది. సొంతకాళ్లపై నిలబడి ఆర్థిక ప్రగతి సాధించడమే కాకుండా వారే పది మందికి ఉపాధి కూడా కల్పించేలా వారికి సహాయసహకారాలు అందిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళలు నేడు వ్యాపార విపణిలో మహారాణుల్లా రాణిస్తున్నారు. సామూహికంగా మహిళలంతా ఆర్థిక స్వేచ్ఛ సాధించాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ క్రాంతి పదం ఆధ్వర్యంలో 'చేయూత మహిళా మార్ట్'ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్రంలో 22 మార్ట్‌లు ఏర్పాటు కాగా, విజయనగరం జిల్లాలో రెండు మార్ట్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో 34,385 మంది మహిళలు భాగస్వాములయ్యారు.

**కోటి రూపాయల పెట్టుబడితో...**

ఈ మార్ట్‌ల్లో స్వయంసహాయక సంఘాల సభ్యులందరి భాగస్వామ్యం ఉండాలన్నదే ప్రభుత్వ యోచన. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి సమ్మతించిన వారొక్కక్కరీ నుంచి రూ.310 చొప్పున వాటాధనం సేకరించారు. ఎస్.కోట మండలంలో 17,800 ఇచ్చిన షేరుధనం రూ.55,18,000, గరివిడి మండలంలో 16,585 మంది ఇచ్చిన షేరుధనం రూ.51,41,350 మొత్తం కలిపి రూ.1,06,59,350తో ఎస్.కోట, గరివిడిలో గత నెలలో 'చేయూత మహిళా మార్ట్'లను ప్రారంభించారు.

**డీఆర్‌డీఏ పర్యవేక్షణలో ..**

డీఆర్‌డీఏ పర్యవేక్షణలో వైఎస్సార్ క్రాంతి పదం ఉద్యోగులు మహిళలకు వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, డేటా ఎంట్రీ, జీఎస్‌టీ, బిజినెస్ స్కిల్స్, కమ్యూనిటీ స్కిల్స్‌లో పూర్తిస్థాయి శిక్షణ ఇప్పించారు. వ్యాపార నిర్వహణకు కావాల్సిన జీఎస్‌టీ, టాన్, టిన్, లేబర్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ లైసెన్స్ వంటి అన్ని అనుమతులు వారే చేయించి మాక్స్ (ఎంఏసీటీఎస్) సొసైటీలో చేయూత మార్ట్‌లు రిజిస్ట్రేషన్ చేశారు. ప్రధాన ఉత్పత్తి కంపెనీలు నేరుగా మహిళా మార్ట్‌లకు సరుకులు ఇచ్చేలా ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుంది. వీటితో పాటూ డ్వాక్రా, వీడీవీకే ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.

**విస్తరించే యోచనలో:**



వ్యక్తిగత జీవన ప్రమాణాల నుంచి గ్రూప్ యాక్టివిటీ ద్వారా ఎక్కువ మందికి ప్రయోజనం చేకూర్చాలని మహిళా మార్ట్‌లు తెచ్చాం. ఎస్.కోట, గరివిడిలో వీటిని ప్రారంభించాం. ప్రభుత్వం ఎంఎన్‌సీ కంపెనీలతో ఎంఓయూ చేసుకుంది. 'చేయూత' పథకం సహాయంతో జిల్లాలో 4 వేల కిరాణా షాపులను మహిళలు నడుపుతున్నారు. ఇప్పుడు వాళ్లని కూడా మార్ట్‌ల వైపు మళ్లించి, వ్యాపారాన్ని విస్తరించేలా చేయాలని ఆలోచన చేస్తున్నాం. రైతు ఉత్పత్తులను ప్రొక్యూర్ చేసి అమ్మకం చేయాలని, చూస్తున్నాం. ప్రతీ నియోజకవర్గంలో ఒక మార్ట్‌ను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నాం.

– ఎ.కళ్యాణ చక్రవర్తి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్డీఏ, విజయనగరం జిల్లా

**అన్నీ సరుకులు అందుబాటులో..**

అన్ని రకాల నాణ్యమైన నిత్యావసర సరుకులను తక్కువ ధరలో ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నదే మహిళా మార్ట్‌ల లక్ష్యం. డ్వాక్రా సంఘాల నుంచి ఎన్నుకున్న ముగ్గురి సభ్యుల కమిటీ మార్ట్ కమిటీ నిర్వహణ బాధ్యతలు చూస్తుంది. వీరే మార్ట్‌లో ఉద్యోగుల ఎంపిక, వేతనాల చెల్లింపు, లావాదేవీలు పర్యవేక్షిస్తారు. ప్రస్తుతం ముగ్గురు చొప్పన ఉద్యోగులున్న గరివిడి మార్ట్ రోజుకి రూ.68వేలు, ఎస్.కోట మార్ట్ రూ.58 వేల వ్యాపారం చేస్తున్నాయి.

**మహిళల జీవనోపాధికి చేయూత**



'చేయూత' పథకం ద్వారా ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో మహిళలు సొంతంగా వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. మరింత మంది మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని, వారిని పెట్టుబడిదారులుగా చేసి, 'చేయూ త మహిళా మార్ట్‌లు' నెలకొల్పిందీ ప్రభుత్వం. జిల్లాలో ఉన్న రెండు మార్ట్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి.

– వి.రవికుమార్, డీపీఎం, వైఎస్సార్‌క్రాంతి పదం, విజయనగరం జిల్లా

**అందరూ సమాన భాగస్వాములే**



చేయూత మహిళా మార్ట్ నిర్వహణకు ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్‌గా ముగ్గురుం ఉన్నా... అన్ని నిర్ణయాలు గ్రూపుల్లోని సభ్యులతో మాట్లాడి తీసుకుంటాం. పెట్టుబడుల్లో, లాభాల్లో అందరూ సమాన భాగస్వాములే. నాణ్యమైన సరుకులు వీలైనంత తక్కువ ధరకు ప్రజలకు అందించాలని చూస్తున్నాం. ప్రసుతం మార్ట్‌లో రోజుకు సుమారు రూ.60 వేల వ్యాపారం జరుగుతోంది. వైఎస్సార్ క్రాంతి పదం ఉద్యోగులు నిత్యం పర్యవేక్షిస్తూ, తగిన సూచనలు ఇస్తున్నారు.

– గడి జ్యోతి, మహిళా మార్ట్ సెక్రటరీ, భవానీనగర్, ఎస్.కోట మండలం.

# సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


తమ్మిరాజును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రామారెడ్డి, తదితరులు

**డెంకాడ:** సాంకేతికతలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని టిస్సలోప్ సెమీకండక్టర్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ జి.తమ్మిరాజు అన్నారు. జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థి సంఘం 'లక్ష్య' ఆధ్వర్యంలో లక్ష్య–2K23 కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తమ్మిరాజు మాట్లాడుతూ..ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రత్యామ్నాయ శక్తి వనరులు, ఎలక్ట్రికల్ వెహికల్స్, చిప్ డిజైనింగ్ తదితర రంగాల్లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వివరించారు. అందుకు దీటుగా విద్యార్థులు తయారు కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రికల్ వెహికల్స్‌పై వర్క్‌షాప్, ప్రాజెక్టు ఎక్స్‌పో, పోస్టర్ ప్రెజెంటేషన్ వంటి వివిధ రకాల పోటీలు నిర్వహించారు. వాటిని తిలకించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం తమ్మిరాజును ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, సంస్థ కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, ఈఈఈ హెచ్‌ఓడీ కె.సుబ్బరామయ్య, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, వివిధ విభాగాధిపతులు జి.ప్రకాష్‌బాబు, రాజన్‌బాబు, రామారావు, రాజేంద్ర, సతీష్‌పూజారి, దుర్గాశైలజ, సతీష్, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## 'ఫ్రైడే-డ్రైడే' పక్కాగా అమలుచేయాలి


ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

- డీఎంహెచ్‌ఓ రమణకుమారి

**నెల్లిమర్ల రూరల్:** ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌ఓ) ఎస్వీ రమణకుమారి సూచించారు. మండలంలోని సీతారామునిపేట గ్రామంలో శుక్రవారం చేపట్టిన 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు, చెత్తాచెదారం నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేపట్టాలని ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. అనంతరం గ్రామంలో కొత్తగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను సందర్శించారు. ఆమె వెంట ఆరోగ్య సిబ్బంది హిమబిందు, కోమలి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## ఆర్థికాభివృద్ధి దిశగా మహిళా సంఘాలు


మాట్లాడుతున్న వెలుగు ఏపీడీ సావిత్రి, తదితరులు

**పూసపాటిరేగ:** చేయూత మహిళా మార్ట్‌లతో డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని వెలుగు ఏపీడీ కె.సావిత్రి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామైఖ్య సంఘాల లీడర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులు పెట్టుబడితో ప్రారంభించిన మహిళా మార్ట్‌లో సరసమైన ధరలకే నాణ్యమైన వస్తువులు లభిస్తాయన్నారు. మహిళా మార్టులో వచ్చిన లాభాలు సంఘాల సభ్యుల అకౌంట్‌లో జమచేస్తామన్నారు. మండలానికి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 13.5 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో వెలుగు డీపీఎం రవికుమార్, ఏరియా కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఏపీఎం పెంటం నాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చిరుధాన్యాలతో ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న విశ్వేశ్వరరావు

**డెంకాడ:** చిరుధాన్యాలతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ఎఫ్‌పీఓ విశ్వేశ్వరరావు అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో చిరుధాన్యాల సాగు, వినియోగం వలన కలిగే ప్రయోజనాలపై రైతు ఉత్పత్తిదారు సంఘాల సభ్యులకు శుక్రవారం అవగాహన కల్పించారు. చిరుధాన్యాలను సాగు చేయడం ద్వారా నేల సారవంతం అవుతుందన్నారు. అందులో ఉండే పోషకాలు మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రస్తుతం మార్కెట్లో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉన్నందున రైతులు వాటిని సాగు చేసి లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం విజయలక్ష్మి, వైద్య సిబ్బంది శ్రీనివాసు, గురుభక్తులు, సీసీలు సూరిబాబు, నర్సింగరావు, సత్యనారాయణ, వీఏఓలు పాల్గొన్నారు.

## • టీబీపై అప్రమత్తం


గుణుపూరుపేటలో క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

**డెంకాడ:** అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులను ఉచితంగా అందించడం జరుగుతుందని టీబీ వ్యాధి నివారణ సూపర్‌వైజర్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ టీబీ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గుణుపూరుపేట, మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రెండు వారాలకు మించి కఫంతో కూడిన దగ్గు, జ్వరం ఉన్నట్లయితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి గ్రస్తులకు ఉచితంగా చికిత్స, ఆరు నెలల పాటు మందులు అందజేయనున్నట్లు చెప్పారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో డెంకాడ పీహెచ్‌సీ హెచ్‌ఎస్ గురుభక్తులు, ఎల్.టీ గోవింద, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


డెంకాడలో ర్యాలీ చేస్తున్న అధికారులు, సిబ్బంది